# సుందరం

శ్రీ 'కౌండిన్య'

★ ★ ★

'సుందరం'

'వస్తున్నానండీ—'

అంటూ మా ఆవిడ వాళ్ల సీతమ్మ వదినగారి వంటింటిలోనుంచి మెల్లగా, ఏదో అనుకుంటూ మేడ మీదికి వచ్చింది...

'మొత్తంమీద తీరికయిందే ఇంటికి రావడానికి. అయిదుగంటలకి ఆఫీసు వదుల్తారనిపేరు. నే కాపరానికి వచ్చి అయిదేళ్లయింది. ఒక్కరోజయినా ముచ్చటగా సూర్యాస్తమయం కాకుండా ఇంటికి వస్తారేమో అని చూస్తాను! ఇదేం ఆఫీసు బాబూ! ఉద్యోగాలు మావాళ్లుకూడా చేశారు కాని ఎక్కడా చూడలేదమ్మ యీ మోస్తరు.' అంటూ మామూలు సొద మొదలెట్టింది. ఆ ప్రవాహానికి అడ్డుకట్ట వేస్తేనేకాని లాభంలేదని

'సరేకాని కాస్త కాఫీ ఏమన్నా యిస్తావా లేకపోతే సుందరాశే యింత అన్నంపెడతావా? అన్నట్లు యీవేళ మంచి సినిమావుంది. 9 గంటల ఆటకి వెళదాం, సుందరాశే తెమిలితే?'

'ఒడ్డించమన్నారా ఏమిటయితే?'

'ఊఁ? యిదుగో యీవేషం అంతా తీసేసి కాళ్లు కడుక్కుంటా' అంటూఉండగానే ఒక్క ఉడాములో క్రిందకి వెళ్లిపోయింది సుందరం.

సుందరం అభిప్రాయం ఏమిటంటే ఆఫీసు అయిదు గంటలకే మూస్తారుగదా ఆరున్నరదాకా నేనేం చేస్తాను అని. అంటే ఆఫీసు మూసేసినా, నాకుర్చీని, బల్లని, అంటిపెట్టుకొని యింకోగంటసేపు కూర్చుంటానని. కలక్టరు ఆఫీసువ్యవహారం సుందరానికి ఏమి తెలుసు పాపం!

స్వతహాగా సుందరానికి అన్ని చూడాలని, తెలుసుకోవాలని చాలా సరదా. పాపం వాళ్లవాళ్లకి ఏమీలేక పోవడంమూలాన్ని యిటువంటివి తన చిన్నతనంలో ఎరుగదు తరుచు. అందుచేతనే సినిమాకువెళ్లడం అంటే ఆనాడు పండుగ.

* * *

'అవును, అబ్బాయి ఏడీ?'

'పడుకున్నాడు'

'అప్పుడే!'

'ఏం. రాత్రి పొద్దోయిందాకా మేలుకుని నన్ను వేపుకొని తినాలా ఏమిటి? చాలు, మీ పోలికలు వచ్చిఉంటే నా ప్రాణాలుకాస్త పోయేవి! రాత్రి రెండుజాములదాక పడక మొహం చూడకుండా ఉండడానికి.'

'మా పోలికలు రానక్కరలేదు బాబూ. పోనీ, అందానికీ, తెలివితేటలకీ, ఆనిద్దరకీ వాడి మేనమామల పోలికవచ్చి.........'

'చాలు. మాతమ్ముళ్లని మీరు ఎంచక్కరలేదు. వాళ్లు మిమ్మల్ని ఎప్పుడేనా ఏమన్నా అంటూరా! ఏదో వాళ్ల ఖర్మాన్నివాళ్లు ఉన్నారు. కాకా ఏమమ్మా అందానికీ......అన్నారు ఏం? మీచెల్లెళ్లు మహా అప్సరసలు కాబోలునేం! ఏదోనల్లగా ఉన్నారని మహాఎంచుతారు. నల్లదనంలోనే అందంఉంది!'

'పోనీలేగాని ఆ నిద్దరకి మాత్రం వాళ్ళపోలిక వచ్చింది.'

'ఆఁ. మీరుమరీని, మాతమ్ముళ్లు పగలస్తమానూ రాత్రితెల్లవార్లూ ఒకటే నిద్రపోతారా ఏమిటి?'

'సా...రె. నువ్వేగా అన్నావు నిద్దరకి మాపోలిక అక్కరలేదని, మీవాళ్లు పోలిక కావాలనీను!'

'నేనలా అనలేదు. ఒకవేళఅంటేమాత్రం...నాయిష్టం మా తమ్ముళ్లని నేనేమేనాఅంటాను. అంటే మీరుకూడా అనాలికాబోలు!'

'సరే పోనీలేకాని, పెందరాళే తెమలాలి. అప్పుడే 8 గంటలయింది!' అంటూ చెయ్యికడుక్కుని బయట పడ్డాను. మొత్తంమీద యీరాత్రి ఏమీబాగాలేదు. వ్యవహారం కాస్తయిదిగాఉంది. దాంతోటివాళ్ల తమ్ముణ్ణి నిద్ర ఎక్కువ అన్నానట!......తననిచ్చూ!......

* * *

'ఏమండీ యీచీర కట్టుకోనా లేకపోతే. అబ్బాయి బారసాలకి కొనుక్కున్నది కట్టుకోనా?' అంది సుందరం, పెట్టిలో సగంబట్టలు పైనపడేసి' యింకోటిచేత్తో పైకితీస్తూ.

'..................'

'అబ్బ! చెప్పండిమరీ. టైము లేదంటారు మళ్లీ!'

'ఏదో ఒకటి కట్టుకుందూ చప్పునా'

'అందుకే మరీ. పోనీమీరు...అప్పుడు...పెట్టినచీర కట్టుకోనా యేమిటి?'

'ఎప్పుడుపెట్టిన చీరా?'

'ఆఁ ఎప్పుడో అప్పుడు, అట్టే తెలియనట్లుగా'

'కట్టుకో'

'జాకెట్టు...కూడా...అప్పటిదే'

'గడియారపు గొలుసూను, చంద్రహారం మాత్రం వేసుకుని వస్తాను. ఏం?'

'చప్పనతెములుమరి, తొమ్మిదయింది.'

మొత్తంమీద ఎల్లాగయితే చీర సింగారింపు అయింది. ఇంక బయలుదేరదామనుకుంటే, ఏమిటో మించిపోయినట్టు లోపలికి పరుగెత్తింది. ఏమా అనుకున్నాను. కాస్సేపటికి ఏమిటో చేతులో పట్టుకుని సణుగుకుంటూ తయారయింది.

'ఎప్పుడూయింతే మీరు. పోనీ సినీమాకు వెళ్లాలనుకున్నప్పుడేనా కానిని మల్లెపువ్వులేనా వచ్చే దారిలో కొనుక్కొని రాకూడదూ!'

'అదిగో! ఎవో పెట్టావే తలలో'

'ఆఁ చెప్పకుంటే సిగ్గుకూడాను. ఏమున్నాయి దొడ్లో చంద్రకాంత మొక్కలేగా.'

'యింకనేం మరి'

'చాలు'

సుందరంతలలో చంద్రకాంత పువ్వులుకూడా అందంగానే కనిపించాయి. ఏపువ్వులయితేం మా సుందరానికి ఆఖరికి గడ్డిపువ్వులయినాసరే, పువ్వవు తేచాలు, కాగితపువ్వులమాట ఏమో, నే చెప్పలేనుగాని!